నగరంలో శరవేగంగా అభివృద్ధి పనులు


పనులను ప్రారంభిస్తున్న మేయర్ దండు నీతూకిరణ్

నిజామాబాద్‌నాగారం : నగరంలోని అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని మేయర్ దండు నీతూకిరణ్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని 34వ డివిజన్ మిర్చి కాంపౌండ్ జయశ్రీ ఇండస్ట్రీస్ వద్ద రూ. 5 లక్షల నిధులతో చేపట్టే సీసీ డ్రైనేజీ పనులను, 44వ డివిజన్ ప్రభుత్వ వైద్య కళాశాల ముందు నిర్మించే సీసీ డ్రైనేజీ పనులను మేయర్ నీతూకిరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నగర అభివృద్ధే లక్ష్యంగా అర్బన్ ఎమ్మెల్యే గణేశ్‌గుప్తా నిధులిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కల్పన మల్లేశ్, సుధా మధు, బీఆర్‌ఎస్ నాయకులు కొండపాక రాజేష్, నీలగిరి రాజు, ఇంజనీర్ వాజీద్ తదితరులున్నారు.

క్లుప్తంగా

ప్రభుత్వమే ఇన్సూరెన్స్ చెల్లించాలి



ఖలీల్‌వాడి : ఆటో డ్రైవర్లకు ప్రభుత్వమే ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్ (బీఎల్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని బీఎల్‌ఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోడ్రైవర్లకు ఏడాదికి రూ. 8,000 ఇన్సూరెన్స్ చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌టీయూ జిల్లా అధ్యక్షులు కె మధు, ప్రధాన కార్యదర్శి మేకల రాజేందర్, ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ కన్వీనర్ రమేశ్, కో-కన్వీనర్ హైమద్ హుస్సేన్, నాయకులు గోపి, గిరి, సాయిబాబా తదితరులున్నారు.

కొనసాగుతున్న 'మధ్యాహ్న' కార్మికుల సమ్మె



నిజామాబాద్ అర్బన్ : మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె ఆరో రోజు కొనసాగింది. శనివారం ధర్నాచౌక్ వద్ద యూనియన్ నాయకులు చక్రపాణి మాట్లాడుతూ 6వ రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదన్నారు. 18 నెలల క్రితం కేసీఆర్ ప్రకటించిన వేతనాలు కూడా చెల్లించి కొత్త మెనూ ప్రకారం రూ. 25 మెనూ చార్జీ పెంచుతూ ఆయన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తా మన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో సా యిలత, సాయమ్మ, మంజుల, ఇర్ఫాన్ బేగం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు



ధర్పల్లి : మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కామర్స్ విద్యార్థులు ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా ఎస్‌బీఐ బ్యాంక్‌ను శనివారం సందర్శించారు. దీనిలో భాగంగా బ్యాంక్ మేనేజర్ విజయేశ్వరి డిజిటల్ లావాదేవీలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్ విధి విధానాలను విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ఏ విధంగా రక్షించుకోవాలే అనే అంశాలపై బ్యాంక్ అధికారులు విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రజీయోద్దీన్, కామర్స్ లెక్చరర్ మహేష్ కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ ప్రశాంత్ ,ట్రైనింగ్ ఆఫీసర్ జయంత్ తదితరులు ఉన్నారు.

కార్మిక గర్జన పోస్టర్ల ఆవిష్కరణ



ఖలీల్‌వాడి : కేజీబీవీ నాన్‌టీచింగ్-వర్కర్స్‌కు కనీస వేతనాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్-వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో శనివారం తిలక్‌గార్డెన్‌లో కార్మిక గర్జన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సుధాకర్ మాట్లాడుతూ కేజీబీవీల్లో పనిచేస్తున్న నాన్‌టీచింగ్-వర్కర్స్‌కు ఇప్పటికీ కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. డిమాండ్ల సాధన ఆగస్ట్ 4న హైదరాబాద్‌లో కార్మిక గర్జన నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈశ్వరి, కేజీబీవీ సిబ్బంది సంధ్య, ఉమ తదితరులున్నారు.

జక్రాన్‌పల్లి ఎస్సైపై ఫిర్యాదు

ఖలీల్‌వాడి : పట్టా భూముల సరిహద్దు క్లియరెన్స్‌లో జక్రాన్‌పల్లి ఎస్సై శ్రీకాంత్ అక్రమ కేసులు బనాయించారని ఇంఛార్జి సీపీ ప్రవీణ్ కుమార్‌కు ఈనెల 12న ఫిర్యాదు చేసినట్లు బాధితుడు నెల్లోల రవీందర్ తెలిపారు. జక్రాన్‌పల్లిలోని పడకల్‌లోని చాంద్‌మియాబాగ్‌లో సర్వేనం.1,398లో 5ఎకరాల 11 గంటల భూమి కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నామన్నారు. 1398 సర్వేనెంబర్‌లో 15 ఎకరాల 33 గంటల భూమి ముగ్గురికి కలిపి ఉందని, అయితే సరిహద్దు వివాదం ఉండగా ఎస్సై అక్రమంగా తనపై ఒత్తిడి తెచ్చి కేసు బనాయించారని, ఎస్సైపై కలెక్టర్‌కు, మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన


మాత్రలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఇందల్వాయి: ఇందల్వాయి పీహెచ్‌సీలో నులి పురుగుల నివారణ కార్యక్రమంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీన నులి పురుగల నివారణ దినోత్సవం జరుగుతుందని 1 నుంచి 19 ఏళ్ల వయసు ఉన్న పిల్లలందరికి నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఆగస్టు 2వ వారంలో నిర్వహించే ఇంద్రధనస్సు కార్యక్రమానికి ఆరోగ్య సిబ్బంది సిద్ధం కావాలని రెండేళ్ల లోపు వయస్సున్న పిల్లల జాబితా సిద్ధం చేసుకో వాలని హెచ్‌ఈవో శంకర్ సూచించారు. అ నంతరం ఆరోగ్య కార్యకర్తలకు డిజిటల్ బీపీ ఆపరేటర్లను అందజేశారు. ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్ అలీ, ఫార్మాసిస్ట్ విజయలక్ష్మి, సునీత, ఆనంద్ ఉన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్ : పాత పెన్షన్ సాధన, సంకల్ప యాత్రకు సంబంధించి పోస్టర్లను తపస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఆవిష్కరించారు. సీపీఎస్ రద్దు కోసం మొట్టమొదట తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఉద్యమం చేపట్టిందన్నారు. సీపీఎస్‌తో ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ప్రభుత్వానికి నివేదించినప్పటికీ సమస్య పరిష్కారం కావట్లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బట్టు బద్రీనాథ్, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారెడ్డి, మధుసూదన్, జిల్లా కార్యదర్శులు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యం


మాట్లాడుతున్న పల్లె గంగారెడ్డి

సుభాష్‌నగర్ : దేశంలోని దళితుల అభ్యున్నతి బీజేపీతోనే సాధ్యమని, రామ్‌నాథ్ కోవింద్‌ను రాష్ట్రపతిని చేసింది బీజేపీ అని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. 12 మంది దళితులకు కేంద్ర మంత్రి వర్గంలో చోటు కల్పించిందని, నలుగురిని గవర్నర్లను చేసిందన్నారు. భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించి చారిత్రాత్మక నిర్ణయాన్ని తీసుకుందని తెలిపారు. అంబేడ్కర్‌ను స్మరించుకుంటూ ప్రధాని మోదీ భీమ్ యాప్‌ను ప్రారంభించారన్నారు. అంబేడ్కర్ పుట్టిన, పెరిగిన, విద్యనభ్యసించిన ఐదు ప్రదేశాలను బీజేపీ హయాంలో జాతీయ స్మారక చిహ్నాలు నిర్మించారని, వీటిని ప్రధాని మోదీ పంచతీర్థాలుగా ప్రకటించారన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు దళితులను కేవలం ఓట బ్యాంకుగా మాత్రమే చూస్తున్నాయన్నారు. రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్, నాయకులు పడిగెల వెంకటేశం, న్యాలం రాజు, లక్ష్మీనారాయణ, రాజశేఖర్ రెడ్డి, బాలకృష్ణ, సుదీప్, బద్దం కిషన్ ఉన్నారు.

గొప్ప నాయకుడు మోదీ..



సుభాష్‌నగర్ : ప్రపంచంలోనే గొప్ప నాయకుడు ప్రధాని మోదీ అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నగరంలోని పుర ప్రముఖులను కలిసి 9 ఏళ్ల మోదీ సుస్థిర పరిపాలన, విజయాలపై రూపొందించిన బుక్‌లెట్, కరపత్రాలను యెండల లక్ష్మీనారాయణ అందజేశారు. ప్రగతి ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ లక్ష్మారెడ్డి, రిటైర్డ్ ఎంహెచ్‌ఓ డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్, న్యాయవాది గొర్రెపాటి మాధవరావు, చార్టెడ్ అకౌంటెంట్ యాదగిరిలను కలిసి అందించారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా అధికార ప్రతినిధి స్వామి యాదవ్, అర్బన్ అసెంబ్లీ కో కన్వీనర్ నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

పోస్టల్ బీమాతో భరోసా


బీమా పత్రాలను అందజేస్తున్న ఏజీపీ ప్రదీప్

ఖలీల్‌వాడి : పోస్టల్ బీమాతో సామాన్యుడికి భరోసా లభిస్తుందని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ యెండల ప్రదీప్ అన్నారు. శనివారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ స్ఫూర్తితో దివంగత రైతు నేత వేముల సురేందర్ రెడ్డి జ్ఞాపకార్థం యెండల ప్రదీప్ 30 మందికి సొంత ఖర్చుతో పోస్టల్ బీమా సౌకర్యం కల్పించారు. జిల్లాకోర్టు చౌరస్తాలో ఈ సందర్భంగా నిర్వహించిన బీమా కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.600 బీమా ప్రీమియం చెల్లింపుతో రూ. 10 లక్షల ప్రమాద పరిహారం లభిస్తుందన్నారు. తెలంగాణ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షుడు ఆశ నారాయణ, తెయూ న్యాయ కళాశాల విద్యార్థులు నరేంద్రనాథ్, అఖిల్, నిఖిల్, శ్రీనివాస్ తదితరులున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



సుభాష్‌నగర్ : నగరంలోని కోటగల్లీకి చెందిన హరిబాబు కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ ట్రస్ట్ నుంచి రూ. 10 వేల ఆర్థికసాయాన్ని శనివారం అందజేశారు. అంతకుముందు ఆయనను పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ధన్‌పాల్ లక్ష్మీబాయి విఠల్ గుప్త చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగోల్ల లక్ష్మీనారాయణ, గోపిడి వినోద్ రెడ్డి, అంతరెడ్డి హరీష్‌రెడ్డి, ఆశిష్, భాస్కర్‌రెడ్డి, ఆనంద్, పవన్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం

ఖలీల్‌వాడి : అర్బన్‌లో సోమవారం నుంచి ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్ అన్నారు. 11, 12 వార్డులలో జరిగే కార్యక్రమానికి టీడీపీ నేతలు హాజరుకావాలని తెలిపారు.

విద్యార్థుల క్షేత్ర పర్యటన




సిరికొండ: మండల కేంద్రంలో గల ప్రతిభ హైస్కూల్ విద్యార్థులు క్షేత్ర పర్యటనకు శనివారం వెళ్లారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, 33/11 కేవీ సబ్ స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్దకు విద్యార్థులు క్షేత్ర పర్యటనకు వెళ్లారు. వాటి ద్వారా ప్రజలకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆయా శాఖల అధికారులు పని తీరును విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ హరీష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియామకం



సుభాష్‌నగర్ : బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధికార ప్రతినిధిగా సాయి పవార్, ఓబీసీ మోర్చా వినాయక్‌నగర్ మండల అధ్యక్షుడిగా చిన్నకారి నరేష్‌ను శనివారం నియమించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి న్యాలం రాజు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బీఆర్ శివప్రసాద్, మీసేవ శ్రీనివాస్, శీల శ్రీనివాస్, సందీప్ పాల్గొన్నారు.

వీఎన్‌ఆర్ స్కూల్‌లో బోనాలు



నిజామాబాద్ సిటీ : నగరంలోని వర్ని రోడ్డు వీఎన్‌ఆర్ పాఠశాలలో శనివారం బోనాల పండుగ జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థులు బోనం ఎత్తారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం వీణా యదేష్‌గౌడ్, ప్రసన్న శ్రీహరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

పాఠశాలకు ఫ్యాన్ల అందజేత



సిరికొండ : మండలంలోని చీమన్‌పల్లిలో మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలకు గ్రామ మాజీ సర్పంచ్ జితేందర్‌సింగ్ ఆరు సీలింగ్ ఫ్యాన్లను విరాళంగా శనివారం అందచేశారు. పాఠశాలలో విద్యార్థినుల సౌకర్యార్థం ఫ్యాన్లను అందచేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

పిల్లల చదువులపై శ్రద్ధ చూపాలి



డిచ్‌పల్లి : పాఠశాలల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత పిల్లల చదువులపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిచ్‌పల్లి ఖిల్లా ఉన్నత పాఠశాల హెచ్‌ఎం. జి.జనార్దన్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ గణేష్ సూచించారు. శనివారం ఈ రెండు పాఠశాలల్లో పేరెంట్స్ సమావేశాలు నిర్వహించారు. ఖిల్లా హైస్కూల్‌లో విద్యార్థుల అవసర నిమిత్తం ఒక ల్యాబ్ ఏర్పాటు, పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మిస్తున్నట్లు తెలిపారు.

కొనసాగుతున్న జీపీ కార్మికుల సమ్మె


ధర్పల్లిలో సమ్మె చేస్తున్న జీపీ కార్మికులు


ఇందల్వాయిలో..


మోపాల్‌లో..


జక్రాన్‌పల్లిలో..


డిచ్‌పల్లిలో..

ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలంటూ నియోజకవర్గాల్లోని మండలాల్లో గ్రామపంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి పదో రోజుకు చేరుకుంది. తెలంగాణ ప్రభుత్వం వెంటనే జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఊపందుకున్న వరినాట్లు

- మూడ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో..
- 4,500 ఎకరాలకు పైనే పూర్తి
- యూపీ, బీహార్, మహారాష్ట్ర నుంచి కూలీల రాక


మోపాల్‌లో నాట్లు వేస్తున్న కూలీలు

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మూడ్రోజులుగా వరుసగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు బిజీబిజీ అయ్యారు. వరి నాట్లు ఊపందుకున్నాయి. యూపీ, బీహార్, మహారాష్ట్రతోపాటు గిరిజన తండాల నుంచి కూలీలు వచ్చి నాట్లు వేస్తున్నారు. ఎకరానికి రూ. 4 వేల నుంచి రూ.4500 వరకు కూలి చెల్లిస్తున్నారు. మోపాల్ మండలంలో ప్రధానంగా వరి పంటను రైతులు సాగుచేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 4,500 ఎకరాలకుపైనే నాట్లు పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. మండలంలో శుక్రవారం అర్ధరాత్రి 11 గంటల నుంచి 2 గంటల వరకు 52 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

ఈ సీజన్‌లో..

మండలంలో 18,327 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. సీజన్‌లో 15,302 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేస్తారని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. అందులో వరి 14,700 ఎకరాలు, సోయా 150, ఆయిల్ పాం 40, మొక్కజొన్న 120, కూరగాయలు 20 ఎకరాలు, పత్తి 30, పండ్ల తోటలు, కందులు, ఇతర పంటలు మిగతా భూమిలో సాగు చేస్తారు. కానీ ఈ సీజన్‌లో సోయా, మొక్కజొన్న, ఇతర పంటల వైపు రైతులు ఆసక్తి చూపడం లేదు. కేవలం వరికే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.

ఆలస్యంగా ఆరంభం..

వానాకాలం సీజన్‌లో వర్షాలు 45 రోజులు ఆలస్యంగా కురవడంతో వరి రైతులు ఆందోళన చెందారు. నేటికీ చెరువుల్లోకి కొత్త నీరు చేరలేదు. బోరుబావుల కింద నాట్లు నత్తనడకన సాగాయి. నీటి వినియోగం పెరగడంతో భూగర్భజలాలు తగ్గిపోయాయి. మొన్నటి వరకు కేవలం బోరుబావుల కింద మాత్రమే వరి నాట్లు సాగు చేశారు. శుక్రవారం నాటికి 4,500 ఎకరాలకుపైనే వరి నాట్లు పూర్తయ్యాయి. మిగతా పంటలు అంతంత మాత్రంగానే సాగుచేస్తున్నారు. మహారాష్ట్ర, యూపీ, బీహార్‌తోపాటు గిరిజన తండాల నుంచి రైతులు నాట్లు వేసేందుకు కూలీలు వస్తున్నారు. ఎకరానికి రూ.4వేల నుంచి రూ.4500 వరకు తీసుకుంటున్నారు. కాగా ఇదే విషయాన్ని ఏవో వెంకట రవీందర్ వివరణ కోరగా, వర్షాలతో వరి నాట్లు ముందుకు సాగుతున్నాయని, ఆరుతడి పంటలకు సీజన్ అనుకూలించలేదు. వరి పంట వైపే రైతులు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

ఎక్స్‌టర్ కారు విడుదల



జక్రాన్‌పల్లి : మండలంలోని అర్గుల్‌లోని హ్యుందయ్ షోరూంలో శనివారం హ్యుందయ్ మైక్రో ఎస్‌యూవీ ఎక్స్‌టర్ కారును ఆర్మూర్ మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటస్వామి శనివారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో షోరూం ఎండీ నల్ల దినేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి డీఎస్పీ బదిలీ

ఖలీల్‌వాడి: ఎన్నికల నేపథ్యంలో బదిలీలు కొనసాగుతున్నాయి. కామారెడ్డి డీఎస్పీ సురేశ్‌ను తొర్రూర్‌కు బదిలీ చేస్తూ శనివారం రాత్రి డీజీపీ అంజని కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ఎవరికీ పోస్టింగ్ ఇవ్వలేదు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	61,200	వెండి (కిలో)	77,800
22 క్యారెట్స్	56,425	- నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు	డ్రెస్డ్	240
	(కిలోకు)	లైవ్	200
స్కిన్‌లెస్	280	మటన్	800

కూరగాయల ధరలు (రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	110	140	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	90	120
బీరకాయ	50	70	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	17	30
చిక్కుడుకాయ	100	120	గోబిగడ్డ	15	30
కాకరకాయ	40	60	గోబిపువ్వు	50	70
వంకాయ	20	40	బీట్‌రూట్	30	50
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	60	90	చామగడ్డ	35	50
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	60	80	చిక్కుడుకాయ	50	70
క్యాప్సికం	40	60			

- ఇందూరు

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-10.20 బేబి-2023 (తెలుగు)-1.20,4.20 7.30 10.30
స్క్రీన్-2	బేబి-2023(తెలుగు)-10.30 సామజవరగమన(తెలుగు)-1.40,7.40 మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)- 4.35
స్క్రీన్-3	మహావీరుడు(తెలుగు)-10.20 మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-1.25 7.30,10.30 సామజవరగమన(తెలుగు)-4.35

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	బేబి(తెలుగు)-11.05 6.10 9.45 మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)-2.40
స్క్రీన్-2	మిషన్ ఇంపాజిబుల్ (ఇంగ్లీష్) - 12.00, 3.30, 7.00, 10.30
స్క్రీన్-3	మహావీరుడు(తెలుగు)-10.05, 6.55 ఇన్సిడియోస్(ఇంగ్లీష్)-1.30 రంగబలి(తెలుగు)-4.00 నాయకుడు(తెలుగు)-10.20
స్క్రీన్-4	బోగాన్(తెలుగు)-10.05 సామజవరగమన(తెలుగు)-1.05 నాయకుడు(తెలుగు)-4.05 రంగబలి(తెలుగు)- 4.20 భారతీయ ది(తెలుగు)-10.15
దేవి	మహావీరుడు(తెలుగు)
నటరాజ్	మిషన్ ఇంపాజిబుల్(తెలుగు)
లలితామహల్	నాయకుడు(తెలుగు)
విజయ్	బేబి

సంక్షిప్తం

వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి



నిజామాబాద్ అర్బన్ : ఎస్సీ వర్గీకరణ బిల్లును బీజేపీ ప్రభుత్వం వెంటనే పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ కనుక ప్రమోద్ అన్నారు. శనివారం ఆర్ అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహించారు. బీజేపీ 2014లో అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చిందని ప్రస్తుతం మరిచిపోయిందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నాగభూషణం, జిల్లా సీనియ ర్ నాయకులు సురేష్ మాదిగ, జిల్లా కోఆర్డినేటర్ పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వాహనంతో ఢీకొడతామని బెదిరింపు



ఖలీల్‌వాడి : వాహనంతో ఢీ కొడ్తామని బెదిరించిన వాహన డ్రైవర్‌తో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకోవాలని బాధితుడు దివిటి నరేశ్ మూడో టౌన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. శనివారం కంఠేశ్వర్ పరిధిలోని మహిళ కాలేజీ సమీపంలో మూత్రవిసర్జన చేస్తున్న సమయంలో టీఎస్ 17 టీ 5445 నంబర్ వాహనం తనపైకి వచ్చి తనను చంపుతామని అకారణంగానే డ్రైవర్ బెదిరించారని, 100 ఫోన్‌కు చేయగా మొదట స్పందించలేదని, తర్వాత పోలీసులు సంఘటనాస్థలానికి వచ్చారన్నారు. కాని సదరు డ్రైవర్‌ను పట్టుకోలేదన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

ఖిల్లా రామాలయంలో అన్నదానం



నిజామాబాద్ సిటీ : నగరంలోని ఖిల్లా రామాలయంలో శనివారం శ్రీ రాముల స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి శనివారం రామాలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. గతంలో ఇక్కడ ఖిల్లా జైలు ఉండటంతో ఇక్కడకు ఏడాదిలో శ్రీ రామ నవమి నాడు మాత్రమే ఆలయానికి భక్తులకు అవకాశం ఉండేది. జైలును సారంగపూర్‌కు మార్చటంతో భక్తుల తాకిడి ఎక్కువ అవుతోంది. పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా పలువురు స్వచ్ఛందంగా రామాలయంలో అన్నదానం చేస్తున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 20764
90102 86628 (నిజామాబాద్)
94920 10949 (బోధన్, బాన్సువాడ)
95055 08389 (ఆర్మూర్)
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
యం. మధుసూధన్ (ACO) : 9951027699
నిజామాబాద్ అర్బన్ & రూరల్ రాంనాథ్ : 7997958181
ఆర్మూర్ ఎ. శివ : 9848956776
బోధన్ వి. మల్లికార్జున (ACM) : 70955 23222
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899